క్లుప్తంగా

ముక్కంటి సేవలో ఐఏఎస్ అధికారి


ఆలయ ధ్వజస్తంభం వద్ద ఐఏఎస్ అధికారి ఆర్ఎస్ శర్మ

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం ఐఏఎస్ అధికారి ఆర్ఎస్ శర్మ దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ సతీష్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సిపాయికి ఘన సన్మానం


ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న గౌడసంఘం నాయకులు

శ్రీకాళహస్తి: ఎమ్మెల్సీగా ఎన్నికైన డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యంను మంగళవారం శ్రీకాళహస్తి గౌడ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మోహన్‌గౌడ్, శ్రీరాములుగౌడ్, పురుషోత్తం గౌడ్, బాలాగౌడ్, కిషోర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు వేగవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పంచాయితీ అధికారి రాజశేఖర్‌రెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): ప్రతి మండలంలో ఇంటి పన్నుల వసూలును వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి రాజశేఖర్‌రెడ్డి కోరారు. మంగళవారం శ్రీకాళహస్తి ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను వసూలు, నాన్ టాక్సెస్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని ఇంటి పన్నులు మార్చి నెల మొదటి వారం లోపల వందశాతం వసూలు చేయాలని ఆదేశించారు. తక్కువ శాతం ఇంటి పన్నులు వసూలు చేసిన పంచాయతీ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. ఈ సమావేశంలో డివిజనల్ పంచాయతీ అధికారి రూపారాణి, ఎంపీడీవో తరున్నాక్షి రెడ్డి, తొట్టంబేడు, శ్రీకాళహస్తి, కేవీబీ పురం, ఏర్పేడు మండలాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన


మాట్లాడుతున్న న్యాయవాది రాజేశ్వరరావు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని సబ్‌జైలులో ఖైదీలకు మంగళవారం శ్రీకాళహస్తి న్యాయస్థానం సీనియర్ సివిల్‌జడ్జి బేబీరాణి ఆదేశాల మేరకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయవాది రాజేశ్వరరావు మాట్లాడుతూ న్యాయపరమైన సమస్యలు ఉంటే తెలిపాలని ఖైదీలను కోరారు. అనంతరం వారికి భారత చట్టాలపై అవగాహన కల్పించారు. సమస్యలను అర్జీల రూపంలో తెలిపితే తక్షణమే పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రమేష్, అరుణ్, ప్రజ్ఞశ్రీ, సబ్‌జైల్ సూపరింటెండెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్ మోటారు వైర్లు చోరీ

బుచ్చినాయుడుకండ్రిగ:మండలంలోని తానిగిల్లు గ్రామంలోని పొలంలో నీటి కోసం బోరుకు అమర్చిన సోలార్ మోటారు వైర్లు చోరీ గురయ్యాయని రైతు వేంకటేశ్వర్లు తెలిపారు. పంటలకు నీటిని అందించడానికి మోటారు వద్దకు వెళ్లగా మోటారు వైర్లు గుర్తు తెలియని దుండగులు చోరీ చేసినట్లే గుర్తించారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం


బాధితులకు ఆర్థికసాయం అందజేస్తున్న ఆకర్ష్ రెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని రామచంద్రాపురానికి చెందిన కె.సుశీల, కొనతనేరి గ్రామానికి చెందిన కె.ఆదిలక్ష్మి మంగళవారం అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమారుడు బియ్యపు ఆకర్ష్ రెడ్డి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం దహనక్రియలకు రూ.10 వేల చొప్పున ఇద్దరికి రూ.20 వేలు అందజేశారు. మృతుల కుటుంబాలకు ఏసాయం కావాలన్నా అన్నివేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైన్స్‌తోనే మానవ మనుగడ

- మేధస్సును వెలికితీసే వైజ్ఞానికమేళాలు
- డీఈఓ శేఖర్


విద్యార్థుల సైన్స్ ప్రయోగ ప్రదర్శనలను పరిశీలిస్తున్న డీఈఓ శేఖర్

రేణిగుంట: విద్యార్థుల్లో దాగి ఉన్న మేధాసంపత్తిని వెలికి తీసేందుకు వైజ్ఞానిక మేళాలు తోడ్పడుతాయని డీఈఓ శేఖర్ అన్నారు. మండలంలోని కరకంబాడి ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ మేళాలో ఆయన పాల్గొని విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రయోగ ప్రదర్శనలను వీక్షించారు. కరకంబాడి క్లస్టర్ పరిధిలోని 11 పాఠశాలల నుంచి విద్యార్థులు తమ సైన్సు ప్రదర్శనలు తయారు చేసుకుని వచ్చి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గొప్ప మేధావులుగా తమను తాము పెంపొందించుకుని జాతి గర్వించే పౌరులుగా తయారు కావాలని పిలుపునిచ్చారు. గతంలో కరకంబాడి హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయస్థాయి సైన్స్ పోటీలను వెళ్లినట్లు హెచ్ఎం ఆనంద్ ఆయనకు గుర్తుచేశారు. అనంతరం ప్రయోగ ప్రదర్శనల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ, మండల కోఆర్డినేటర్ జయలక్ష్మి, రామచంద్ర, రెడ్డి లక్ష్మి, శివారెడ్డి, పార్థసారథి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి రూరల్‌లో..

శ్రీకాళహస్తి రూరల్: కేవలం సైన్స్‌తోనే మానవ అభివృద్ధి, మనుగడ సాధ్యపడుతుందని శ్రీకాళహస్తి ఎంఈఓ భువనేశ్వరి అన్నారు. శ్రీకాళహస్తి మండల పరిధిలోని ప్రతి సీఆర్సీ పరిధిలోని ప్రభుత్వ స్కూళ్లలో మంగళవారం ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీవీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ప్రదర్శనలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలని చెప్పారు. సర్ సీవీరామన్ జయంతి జందర్భంగా ఏటా ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకుంటామని విద్యార్థులకు తెలిపారు. ప్రభుత్వం సైన్సుపై ప్రత్యేక దృష్టి సారించి పిల్లలు చేసే సైన్సు ప్రయోగాలకు నిధులు కేటాయిస్తోందని అన్నారు. సైన్స్‌లో రోజురోజుకి వస్తున్న మార్పులు గమనించి విద్యార్థులు, ఉపాధ్యాయులు సైన్స్‌లో సరికొత్త ప్రయోగాలు కనుగొని దేశ భవిష్యత్తులో భాగస్వాములు కావాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం రమేష్, శ్రీనివాసులు, సరిత, గోపాలకృష్ణన్, చంద్రశేఖర్, గురునాథం, గోపి, బాలయ్య పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలి..

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): పాఠశాల దశ నుంచే ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా రాణించాలని డీఎస్పీ డీ.విశ్వనాథ్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆర్‌సీపీ గురుకులం(ఢిల్లీ పబ్లిక్ స్కూల్)లో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు సైన్స్ ఫెయిర్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సైన్స్ మేళా ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ కాపిరెడ్డి ఢిల్లీ బాబు రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే పెన్నలపాడు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా విద్యార్థులు జరిపారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు..

శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పలు ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్వీ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు సుబ్రహ్మణ్యం, సంధ్య విచ్చేశారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలను తిలకించి వారికి సూచనలు, సలహాలు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు అందజేశారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: మండలంలోని ఐసర్, ఏర్పేడు, కందాడు, బండారుపల్లి, పాపానాయుడుపేట తదితర పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలు పాఠశాలల విద్యార్థులు సైన్స్ ప్రయోగాలు, పరికరాలను ప్రదర్శించారు. ప్రదర్శనల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, సర్పంచ్‌లు, ఎంఈఓ ప్రేమలత, ఐసర్ అధ్యాపకుడు ఈశ్వరయ్య, ప్రగతి సంస్థ డైరెక్టర్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

భావి భారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి

సత్యవేడు: నేటి విద్యార్థులు రేపటి భావి భారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఎంఈఓ కే. రవి కోరారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రదర్శనలను ఎంఈఓ పరిశీలించారు. క్లస్టర్ పరిధిలో విద్యార్థుల నిర్వహించనప్రదర్శనలు, క్విజ్ పోటీలు, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు ఎంఈఓ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రయోగాలతో మేధస్సు

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రయోగాలు చేయడంతో విద్యార్థుల్లో మేదస్సు పెరుగుతుందని ఎంఈఓ రవీంద్రనాథ్ తెలిపారు. మంగళవారం మండలంలోని 65 పాఠశాల్లో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్తమ నమూనాలు ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. నెలవాయి జెడ్పీ ఉన్నత పాఠశాల్లో సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీవీ రామన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

సృజనాత్మకతను పెంచడానికే సైన్స్‌డే

పిచ్చాటూరు: అంతర్జాతీయ సైన్స్‌డేను పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓలు, హేమమాలిని బాబయ్య, హెచ్ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.

బాల మేధావులను ప్రోత్సహిద్దాం

నారాయణవనం: బాలమేధావులను ప్రోత్సహించి, మంచి పరిశోధకులుగా తీర్చిదిద్దాలని తహసీల్దార్ ప్రమీల అన్నారు. జాతీయ సైన్స్‌డే సందర్భంగా మంగళవారం స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, పాలమంగళం, అరణ్యంకండ్రిగ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులతో విజ్ఞాన ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. ప్రతిభను కనపరచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల విద్య ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ పి.బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జాతీయ సైన్స్ దినోత్సవం ప్రాముఖ్యత, సర్ సీవీ రామన్ గొప్పతనాన్ని విద్యార్థినులకు వివరించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ జాతీయ సైన్స్ దినోత్సవ ఆవిర్భావాన్ని వివరించారు. కళాశాలలో విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ, పోస్టర్ల ప్రదర్శన వంటి పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అదే విధంగా పట్టణంలోని పలు స్కూళ్లలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు.


ఏర్పేడులో ..


నారాయణవనం: ప్రదర్శనను తిలకిస్తున్న తహసీల్దార్


సైన్స్ ప్రాముఖ్యతను వివరిస్తున్న మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు


శ్రీచైతన్య విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలు


సైన్స్ డే బ్యానర్‌ను ప్రదర్శిస్తున్న రాచగున్నేరి స్కూల్ విద్యార్థులు


సత్యవేడు: ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఈఓ కే. రవి

చక్రస్నానం..సర్వపాపహరణం


ధ్వజావరోహణం నిర్వహిస్తున్న అర్చకులు


స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని తొండమాన్‌పురంలో వెలసిన టీటీడీ అనుబంధ ఆలయమైన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి చక్రస్నానం కనుల పండువగా సాగింది. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9వ రోజు మంగళవారం ఉదయం వేద పండితులు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. ఆలయం వద్ద పుష్కరిణి లేకపోవడంతో ఆలయ ఆవరణలో చిన్నపాటి గంగాళం ఏర్పాటు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి ఉత్సవమూర్తులకు, చక్రతాళ్వార్లకు ఆలయ అర్చకులు వైఖానస ఆగమోక్తంగా ఫల, పుష్ప, సుగంధ, పన్నీటి సుగంధ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం, ప్రధాన ఘట్టమైన చక్రస్నానం వేడుకగా నిర్వహించారు. చక్రస్నానం తిలకించటం వల్ల సకల పాపాలు తొలుగుతాయని భక్తుల విశ్వాసం. రాత్రి 7 గంటల 9 గంటల మధ్య అర్చకులు వేద ఘోషలతో, మంత్రోచ్ఛరణల మధ్య ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించారు. దీంతో తొండమాన్‌పురం వెంకన్న బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

భక్తుల అసంతృప్తి..

శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి చక్రస్నానం ప్రధాన ఘట్టం తిలకించడానికి వందలాదిమంది భక్తులు తరలివచ్చారు. పుష్కరిణి పోవడంతో భక్తులు స్నానమాచరిండానికి అవకాశం లేకుండాపోయింది. దీంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు వచ్చే ఏడాది వార్షిక బ్రహ్మోత్సవాల నాటికి అయినా పుష్కరిణిని నిర్మించాలని కోరుతున్నారు.

టైలర్స్ కాలనీ అభివృద్ధికి సహకరిస్తాం


టైలర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: టైలర్స్ కాలనీ అభివృద్ధికి నిర్మాణాత్మక సహకారం అందిస్తామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం శ్రీకాళహస్తి టైలర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు నేతృత్వంలో స్థానిక టైలర్స్ అసోసియేషన్ భవనంలో 30వ వార్షికోత్సవ టైలర్స్ డేని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టైలర్స్ దినోత్సవ పతాకాన్ని అంజూరు తారక శ్రీనివాసులు ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ టైలర్స్‌కు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న మేలును వివరించారు. టైలర్స్ అసోసియేషన్‌లో ప్రతి సభ్యునికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. శ్రీకాళహస్తి దేవస్థానాన్ని బహుముఖంగా అభివృద్ధి చేస్తున్నామని అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. టైలర్స్ కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేసుకునే విధంగా ముందుకు పోవాలన్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టైలర్స్ అసోసియేషన్ లీగల్ అడ్వైజర్ కండ్రిగ ఉమ, అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, గౌరవ సలహాదారులు చాంద్‌బాషా, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిపై దృష్టి సారించండి

పిచ్చాటూరు: వేసవి ప్రారంభమైన నేపథ్యంలో మండలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని పలువురు సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. మంగళవారం ఉదయం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సాధారణ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ హెచ్ రేఖ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వింధ్యకుమారి మాట్లాడుతూ గతంలో తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను ఇప్పటికే గుర్తించి, ముందస్తు చర్యలు ప్రారంభించామన్నారు. పశు వైద్యాధికారి డాక్టర్ మంజుల మాట్లాడుతూ గ్రామాల్లో పశువులకు ఈ సీజన్‌లో సోకే వ్యాధుల నివారణకు టీకాలు వేస్తున్నామన్నారు. అలాగే జనవరిలో ప్రభుత్వం రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా మేలు జాతి పశువుల పునరుత్పత్తి పథకం ప్రవేశపెట్టిందన్నారు. ఏఓ సంజీవ రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ హమీద్, జెడ్పీటీసీ సభ్యులు కె.విష్ణుకుమారి, ఎంపీడీఓ శ్రీనివాసులు, సింగిల్ విండో చైర్మన్, అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి


మంత్రి పెద్దిరెడ్డిని కలిసి సమస్యలు వివరిస్తున్న కోనేటి సుమన్ కుమార్

పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల పరిష్కారించాలని విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్ విన్నవించారు. మంగళవారం తిరుపతిలోని మంత్రి స్వగృహానికి సుమన్ చేరుకుని మంత్రితో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో నెలకొన్న పెండింగ్ బిల్లుల సమస్యను సుమన్ మంత్రి దృష్టికి తెచ్చారు. తన విన్నపాలకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సుమన్ తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తి

తిరుపతి లీగల్ : శ్రీకాళహస్తి అదనపు జూనియర్ సివిల్‌జడ్జిగా జోరుపల్లి కృష్ణప్రియ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు నుంచి ఆమె బాధ్యతలను స్వీకరించారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన ఆమెను ఇటీవలే కొత్తగా జూనియర్ సివిల్‌జడ్జిగా రాష్ట్ర హైకోర్టు ఎంపిక చేసి మొట్టమొదటిసారిగా శ్రీకాళహస్తి జూనియర్ సివిల్‌జడ్జిగా నియమించింది.

పేర్నాటిని గెలిపించుకుందాం


ఎండీపుత్తూరులో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న మదన్‌మోహన్‌రెడ్డి

ఏర్పేడు: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ బలపరచిన పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డిని గెలిపించుకుందామని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం వారు మండలంలోని ఎండీపుత్తూరు, మడిబాక, కందాడు, ముసలిపేడు, ఏర్పేడు, అంజిమేడు తదితర పంచాయతీల్లోని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లను కలిసి పేర్నాటికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మోహనప్రియ, జలదంకి మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐకి సన్మానం

సత్యవేడు: నియోజవర్గ కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్2గా పనిచేస్తున్న వీరాంజనేయులు నంద్యాలకు బదిలీపై వెళ్లడంతో సీఐ శివకుమార్ రెడ్డి, ఎస్ఐ పురుషోత్తంరెడ్డి, సిబ్బంది కలసి ఘనంగా సన్మానించారు.

ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురండి


మాట్లాడుతున్న డాక్టర్ దాంగే యాదవ్

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): రూరల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా స్వయం సహాయక సంఘాల్లో ప్రతి ఒక్కరూ పారదర్శకంగా పని చేసి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని డీఆర్‌డీఏ ఏరియా కోఆర్డినేటర్ డాక్టర్ దాంగే యాదవ్ హెచ్చరించారు. మంగళవారం తొట్టంబేడు మహిళా సమైక్య కార్యాలయంలో తొట్టంబేడు, శ్రీకాళహస్తి, బీఎన్ కండ్రిగ, సత్యవేడు, వరదయ్యపాలెం, కేవీబీ పురం మండలాల్లో పనిచేస్తున్న ఏపీఎంలు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, మండల అకౌంటెంట్లతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అలాగే ఎక్కడైనా అవినీతి జరిగితే ఆ గ్రామ సీసీలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అన్ని మండలాల ఏపీఎంలు, సీసీలు, అకౌంటెంట్లు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నియంత్రణపై సమీక్ష


ఐస్‌లైన్డ్ రిఫ్రిజరేటర్‌ను పరిశీలిస్తున్న పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకులు శ్రీకాంత్‌బాబు

శ్రీకాళహస్తి రూరల్/తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేసే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని శ్రీకాళహస్తి పశుసంవర్థకశాఖ సహాయ సంచాలకులు ఎన్‌వీ శ్రీకాంత్‌బాబు అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని పశుసంవర్థకశాఖ కార్యాలయంలో మంగళవారం శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాలకు చెందిన పశుసంవర్థకశాఖ వైద్యులతో ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 31వ విడత జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా మార్చి 1 నుంచి 31 వరకు టీకాలు వేయాలన్నారు. శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో 48 వేలు ఆవులు, గేదెలకు టీకాలు వేసేందుకు 11 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పశు వైద్యుడు అందుబాటులో ఉన్న ప్రతి పశు వైద్యశాలకు రూ.2 లక్షలు విలువ చేసే ఐస్‌లైన్డ్ రిఫ్రిజరేటర్లను ప్రభుత్వం అందించిందని చెప్పారు. ప్రతి గ్రామంలో పాడి రైతులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేసి టీకాలు వేయించాలన్నారు.

నాణ్యత పాటించకుంటే కఠిన చర్యలు


ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో నాణ్యత పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ జగదీష్ రాజు హెచ్చరించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని సన్నిధివీధిలో ఉన్న హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తికి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారన్నారు. ఇలాంటి చోట్ల పరిశుభ్రత పాటించాల్సిన అవసరం ఉందన్నారు. మరగకాచిన నూనెతో వంటలు తయారు చేయకూడదన్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు పాటించని హోటళ్లనిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. కార్యక్రమంలో వేణుగోపాల్‌రెడ్డి, వెంకటేష్, శంకర సుజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గాలికుంటు నివారణకు టీకాలు

నారాయణవనం: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా సోమవారం నుంచి నెల రోజుల పాటు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ఉచితంగా వేస్తున్నట్లు మండల పశువైద్యాధికారులు భార్గవి, కుమార్ తెలిపారు. వారు మీడియాతో మాట్లాడుతూ నారాయణవనం, పాలమంగళం పశువైద్య శాలల్లో, ఆర్బీకేల వద్ద టీకాలను క్షేత్ర స్థాయి సిబ్బంది బుధవారం నుంచి వేస్తారని వారు తెలిపారు.

నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు


పోలింగ్ కేంద్రాన్ని, పరిశీలిస్తున్న సీఐ శివకుమార్‌రెడ్డి

సత్యవేడు: పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని సీఐ శివకుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం సీఐ బాలుర ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు భారతి, ఎస్ఐ పురుషోత్తం రెడ్డి, డీటీ వెంకటేశ్వర్లు, హెడ్‌కానిస్టేబుల్ మునిరాజ తదితరులు పాల్గొన్నారు.